సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం ; 18 ; సెప్టెంబర్ ; 2024



పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పరిసరాల పరిశుభ్రత బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. 8లో



ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని భరోసా కల్పించాలని రోడ్డు రవాణా సంస్థ జిల్లా అధికారి లీలాప్రసాద్ పేర్కొన్నారు. 8లో



ముగిసిన పవిత్రోత్సవాలు

సింహగిరిపై గత ఐదు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు మంగళవారం ఉదయం ఘనంగా ముగిశాయి. 8లో

న్యూస్‌రీల్

సీపీవోగా గుల్జార్.ఎన్ నియామకం

సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు ఆకాంక్ష జిల్లాకు సీపీవో(సెంట్రల్ ప్రభారి ఆఫీసర్)గా టెలీ కమ్యూనికేషన్ శాఖ అదనపు కార్యదర్శి గుల్జార్. ఎన్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర ప్రభుత్వ విభాగంలోని సిబ్బంది మరియు శిక్షణ వ్యవహారాల శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఏపీతోపాటు ఛత్తీస్‌గఢ్‌లోని కోబ్రా, నారాయణ్‌పూర్, జార్ఖండ్‌లోని గొడ్డా, ఒడిశాలోని కోరాపుట్, మణిపూర్‌లోని చందేల్ ఆకాంక్ష జిల్లాలకు కూడా సీపీవోలను నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది.

పాడేరు వైద్య కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

- తొలిరోజు ఆరుగురికి ప్రవేశం



లక్ష్మీలావణ్యకు మొదటి అడ్మిషన్ ఇస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి, ప్రొఫెసర్లు

సాక్షి,పాడేరు: స్థానిక వైద్య కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. విశాఖ పట్నానికి చెందిన డి.లక్ష్మీలావణ్య (నీట్‌లో 593 మార్కులు)కు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.హేమలతాదేవి మంగళవారం తొలి ప్రవేశం కల్పించారు. ఆమె తండ్రి అప్పారావు విశాఖలో ఆటోడ్రైవర్ కావడంతో ప్రిన్సిపాల్‌తో పాటు ప్రొఫెసర్లంతా ఆమెను అభినందించారు. తొలి రోజు మొత్తం ఆరుగురికి ప్రవేశాలు కల్పించామని ప్రిన్సిపాల్ వెల్లడించారు. తొలివిడతగా కళాశాలకు 20 సీట్లు మంజూరయ్యాయని, ఎంపికైన వారంతా ఈనెల 19లోగా ప్రవేశం పొందాలని సూచించారు. రెండో విడతలో మిగిలిన 30 సీట్లు విద్యార్థులకు కేటాయిస్తారని ఆమె పేర్కొన్నారు.

నవోదయ ప్రవేశాల దరఖాస్తుకు గడువు పెంపు

ఎటపాక: ఎటపాక జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తు గడవు పొడిగించినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఇప్పటి వరకు ఉన్న గడువును ఈనెల 23 వరకు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జెడ్పీటీసీకి పరామర్శ



కొయ్యూరు జెడ్పీటీసీ నూకరాజును పరామర్శిస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు

మహారాణిపేట: విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొయ్యూరు జెడ్పీటీసీ సభ్యుడు నూకరాజును పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు మంగళవారం పరామర్శించారు. స్థానిక వైద్యులతో మాట్లాడి వ్యాధి తీవ్రత, అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య అందించాలని వైద్యులను కోరారు.

కందిరీగల దాడిలో యువకుడికి తీవ్ర గాయాలు



పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న ప్రవీణ్‌కుమార్

డుంబ్రిగుడ: కందిరీగల దాడిలో గిరిజన యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. కితలంగి పంచాయతీ పింపల్‌గుడ గ్రామానికి చెందిన కొర్ర ప్రవీణ్ కుమార్ అనే యువకుడు మంగళవారం తెల్లవారుజామున కాఫీతోటల వద్ద ముళ్ల తుప్పల తొలగింపు, తోట ఈడింగ్ పనుల నిమిత్తం వెళ్లాడు. అక్కడే ఉన్న కందిరీగలు ఒక్కసారిగా అతనిపై దాడికి పాల్పడటంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు హుటాహుటిన వైద్యసేవల నిమిత్తం స్థానిక పీహెచ్‌సీకి తీసుకు వచ్చారు. ఆస్పత్రి సిబ్బంది తక్షణ వైద్యం అందించారు.



డుడుమ జలాశయం



జోలాపుట్టు జలాశయం

జలవిద్యుత్‌కు ఊపిరి



బలిమెల జలాశయం నుంచి విడుదల అవుతున్న వరద నీరు

జిల్లాలో మాచ్‌ఖండ్, సీలేరు, డొంకరాయి, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాలకు నీరందించే జలాశయాల నీటిమట్టాలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా నిండిపోయాయి. జోలాపుట్టులో 2747.50, డుడుమలో 2581.20, డొంకరాయిలో 1034, బలిమెలలో 1511 అడుగుల మేర నీటినిల్వలు ఉన్నాయి. దీంతో ఏడాది పొడవునా మెరుగైన విద్యుత్ ఉత్పత్తి సాధనలో ఏపీ జెన్‌కో అధికారులు నిమగ్నమయ్యారు.

– ముంచంగిపుట్టు/మోతుగూడెం

గిడ్డి సిఫార్సులకు కిడారి చెక్

- గోమంగి మినీ గురుకులం హెచ్‌ఎం/వార్డెన్ పోస్టు కోసం వార్
- చివరికి పంతం నెగ్గించుకున్న మాజీ మంత్రి శ్రావణ్
- ఆయన తీరుపై గుర్రుగా మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి



గోమంగి మినీ గురుకుల పాఠశాల

సాక్షి, పాడేరు: పెదబయలు మండలం గోమంగి మినీ గురుకుల పాఠశాలలో హెచ్‌ఎం కమ్ వార్డెన్ పోస్టు విషయంలో మాజీ ఎమ్మెల్యే, పాడేరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి, అరకు నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ మధ్య వార్ నడుస్తోంది. అరకు నియోజకవర్గ పరిధిలో గల ఈ గురుకులంపై గిడ్డి ఈశ్వరి పెత్తనం ఏంటని కిడారి ఆగ్రహంతో ఉన్నారు. అంతటితో ఆగకుండా ఆమె సిఫార్సుతో హెచ్‌ఎంగా నియమితులైన స్కూల్ అసిస్టెంట్‌ను తొలగించి పంతం నెగ్గించుకున్నారు. చివరకు ఆ స్థానంలో తాను సిఫార్సు చేసిన స్కూల్ అసిస్టెంట్‌ను నియమించేలా పైస్థాయిలో చక్రం తిప్పారు. దీంతో ఆయన తీరుపై గిడ్డి కూడా గుర్రుగా ఉన్నారు.

ఆ పోస్టుపైనే అందరి దృష్టి

గోమంగి మినీ గురుకులం పాఠశాలలో హెచ్‌ఎం కమ్ వార్డెన్‌గా జి.మాడుగుల మండలానికి చెందిన వి.చంద్రకళ గతనెల 23 వరకు పనిచేశారు. అయితే ఈ పోస్టు కోసం పలువురు ఉపాధ్యాయులు పైరవీలు చేశారు. ఈ నేపథ్యంలో పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సిఫార్సుతో హుకుంపేట గిరిజన సంక్షేమ ఇంగ్లీషు మీడియం పాఠశాల స్కూల్ అసిస్టెంట్ యు.రత్నకుమారిని గోమంగి గురుకులం హెచ్‌ఎంగా నియమిస్తూ గిరిజన సంక్షేమ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆమె గత నెల 24న హెచ్‌ఎం బాధ్యతలు స్వీకరించారు. ఇదే పోస్టు కోసం పైరవీలు చేసిన కొంతమంది అరకు నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్‌ను ఆశ్రయించారు. అంతేకాకుండా ఈ నియోజకవర్గంపై గిడ్డి ఈశ్వరి పెత్తనం ఏంటని ఫిర్యాదు చేశారు. దీంతో రగిలిపోయిన మాజీ మంత్రి కిడారి, గిడ్డి ఈశ్వరి సిఫార్సుతో డిప్యూటేషన్‌పై నియమించిన రత్నకుమారిని తొలగించే వరకు ఊరుకోలేదు. తాను సిఫార్సు చేసిన జోలాపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల స్కూల్ అసిస్టెంట్ టీవీ వసంతకుమారిని ఆమె స్థానంలో నియమించేలా సంబంధిత అధికారులతో ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. ఈ మేరకు ఆమెను డిప్యూటేషన్‌పై హెచ్‌ఎంగా నియమిస్తూ ఈనెల 3వతేదీన గిరిజన సంక్షేమశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గిడ్డి ఈశ్వరి సిఫార్సుతో హెచ్‌ఎంగా విధుల్లో చేరిన రత్నకుమారి అక్కడ నుంచి రిలీవ్ అయ్యి హుకుంపేట పాఠశాలకు వెళ్లిపోయారు. ఈ ఆధిపత్య పోరులో చివరికి మాజీ మంత్రి కిడారి పంతం నెగ్గించుకున్నారు.

బాలికలపై హెచ్‌ఎం లైంగిక వేధింపులు

ఆలస్యంగా వెలుగులోకి ఘటన

గంగవరం : స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల వసతి గృహంలో ఉంటూ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న బాలికలపై ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రధానోపాధ్యాయుడు నిబంధనలకు విరుద్ధంగా బాలికల వసతి గృహంలోకి వెళ్లి ఇంటర్ విద్యార్థినులతో అసభ్యకరంగా మాట్లాడడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దృష్టికి బాలికలు తీసుకువెళ్లారు. ఆయన తక్షణం స్పందించి స్థానిక తహసీల్దార్‌కు విషయాన్ని తెలియజేశారు. తహసీల్దార్ ప్రాథమిక విచారణ చేసి, ఐటీడీఏ పీవోకు సమగ్రంగా నివేదించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో హెచ్‌ఎం రామకృష్ణను డిప్యూటేషన్‌పై మంగంపాడు ఆశ్రమ పాఠశాలకు పంపించారు. లైంగిక వేధింపులపై సమగ్ర విచారణ జరిపి, హెచ్‌ఎం రామకృష్ణపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని మరోపక్క గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సస్పెండ్ చేసిన పీవో

రంపచోడవరం: గంగవరం గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడు చంద్రు రామకృష్ణను విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు స్థానిక ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. విచారణ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకున్నామన్నారు.

అర్హులందరికీ పక్కా గృహాలు

కలెక్టర్ దినేష్‌కుమార్



ఉబ్బేటిపుట్టులో ఇంటిని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : జిల్లాలో అర్హులైన ప్రతి గిరిజనుడికి పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ వెల్లడించారు. మండలంలోని ఉబ్బేటిపుట్టులో 2021-22 ఆర్థిక సంవత్సరంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో నిర్మించిన పక్కా గృహాలను మంగళవారం ఆయన లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 17,111 ఇళ్లు మంజూరు కాగా, వీటిలో 2871 నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. జిల్లాలో పీఎం జన్‌మన్ పథకంలో మరో 25 వేల ఇళ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మొదటి విడతలో 8 వేలు, రెండో విడతలో 17వేలు, మూడో విడతలో మరో 17వేల ఇళ్లు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ బి.బాబు పాల్గొన్నారు.

విద్యార్థినులను గుంజీలు తీయించడం అమానవీయం

- ప్రిన్సిపాల్‌ను తక్షణం విధుల నుంచి తొలగించాలి
- మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులకు పరామర్శ



ఆస్పత్రిలో బాధిత విద్యార్థినులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి



కళాశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం: స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో గిరిజన విద్యార్థినులను ప్రిన్సిపాల్ ప్రసూన గుంజీలు తీయించి వేధింపులకు గురిచేయడం అమానవీయమని మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ధ్వజమెత్తారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను మంగళవారం ఆమె పరామర్శించారు. ప్రిన్సిపాల్ తమ పట్ల వ్యవహరించిన తీరును విద్యార్థినులు ఆమెకు వివరించారు. క్రమశిక్షణ పేరుతో తమను 200 వరకు గుంజీలు తీయించారని వారు వాపోయారు. సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్న విద్యార్థినులను సైతం గుంజీలు తీయమనడంతో వారు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారని వారు వివరించారు. వారి ఆరోగ్య పరిస్థితిని మాజీ ఎమ్మెల్యే తెలుసుకున్నారు. బాధిత విద్యార్థినులకు వైఎస్సార్‌సీపీ తరఫున అండగా ఉంటామని, ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించి న్యాయం చేసేవరకు వదిలిపెట్టే పరిస్థితి లేదని హెచ్చరించారు. విద్యార్థినులకు పండ్లు అందజేసిన అనంతరం ఆమె కళాశాలకు వెళ్లి అక్కడి విద్యార్థినులతో మాట్లాడారు. ప్రిన్సిపాల్ తమ పట్ల ఎంతో క్రూరంగా వ్యవహరించారని వారు వాపోయారు. తమతో దుస్తులు ఉతికించడం, ఇల్లు శుభ్రం చేయించే వారని వారు ఆరోపించారు. ఆమె ప్రిన్సిపాల్‌గా ఉంటే తాము చదివేది లేదని విద్యార్థినుల స్పష్టం చేశారు.

ప్రిన్సిపాల్ విధుల నుంచి తొలగింపు: పీవో కట్టా సింహాచలం ప్రకటన

ప్రిన్సిపాల్ ప్రసూనను విధుల నుంచి తొలగించినట్టు స్థానిక ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. మంగళవారం కళాశాలకు వచ్చిన ఆయన విద్యార్థినులతో మాట్లాడారు. పీడీ కూడా తమను కొడుతున్నారని విద్యార్థినులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తాగునీరు, మరుగుదొడ్ల సమస్య ఉందన్నారు. తక్షణ మరమ్మతులకు పీవో ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉంటే ఐటీడీఏలోని కంట్రోల్ రూమ్ నంబరుకు ఫోన్ చేయాలని పీవో సూచించారు. విద్యార్థినులకు ఎదురవుతున్న వేధింపులను పీవో దృష్టికి మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి తీసుకువెళ్లారు. సికిల్ సెల్ ఎనీమియా పిల్లలతో కూడా గుంజీలు తీయించడం అమానవీయమని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి ప్రత్యేక ఆహారం పెట్టకపోవడం దారుణమన్నారు. ఇలాంటి సంఘటనలు తమను ఎంతో బాధించాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, సర్పంచ్ మంగా బొజ్జయ్య, వైస్ ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి ఎంపీటీసీలు వంశీ కుంజం, ఉలవల లక్ష్మి పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం



నులి పురుగుల నివారణ మాత్రలను మింగిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్న పీవో అపూర్వభరత్, ఎంపీపీ సవలం అమల

పాడేరు : విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని శ్రీకృష్ణాపురం బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు ఆయన నులి పురుగుల నివారణ మాత్రలను మింగించారు. జిల్లా వ్యాప్తంగా 64 పీహెచ్‌సీల పరిధిలో 3,35,190 మంది విద్యార్థులు ఉండగా వీరిలో 3,20,775 మందికి మాత్రలను మింగించినట్టు తెలిపారు. డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, డీఐవో డాక్టర్ సాధన, ఆర్‌బీఎస్‌కే మేనేజర్ వై.కిషోర్‌కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి గుల్లేలి సింహాద్రి పాల్గొన్నారు.

నులిపురుగులతో అనారోగ్య సమస్యలు : చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్

చింతూరు: పిల్లల్లో నులి పురుగుల వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, దీని నివారణకు ఆల్బెండాజోల్ మాత్రలు వినియోగించాలని స్థానిక ఐటీడీఏ పీవో అపూర్వభరత్ అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా స్థానిక నర్సింహాపురం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన నులి పురుగుల నివారణ మాత్రవల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ నులి పురుగుల వల్ల పిల్లలు పోషకాహార లోపం, రక్తహీనతతోపాటు శారీరక, మానసిక ఎదుగుదల లోపాలు కలిగి ఉంటారన్నారు. పిల్లలు, కిశోర బాలలు ఎల్లప్పుడూ శుభ్రత పాటించాలని, నులి పురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని ఆయన సూచించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య మాట్లాడుతూ చింతూరు డివిజన్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని ఒకటి నుంచి 19 ఏళ్లలోపు కలిగిన 31,320 మందికి నులి పురుగుల మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సవలం అమల పాల్గొన్నారు.

త్వరలో విజయవాడ - కూనవరం బస్సు సర్వీసు

కూనవరం: విజయవాడ నుంచి కూనవరానికి ఆర్టీసీ బస్సు సర్వీసు త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు విజయవాడ డిపో మేనేజర్ శ్రీనివాసశర్మ తెలిపారు. మంగళవారం ఆయన సాక్షితో ఫోన్‌లో మాట్లాడారు. ఈ ప్రాంతానికి చెందిన ఎంవీవీ రాజు అనే వ్యక్తి సోమవారం తనను కలిసినట్టు ఆయన వివరించారు. సర్వీసు నడిపేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశామని, వారం పది రోజులలో సర్వీస్ ప్రారంభిస్తామని డిపోమేనేజర్ వెల్లడించారు. ఇది కార్యరూపం దాల్చితే శబరి, గోదావరి పవిత్ర సంగమ తీరం, శ్రీరామగిరి పుణ్యక్షేత్ర ప్రాంత ప్రజలు నేరుగా విజయవాడ వెళ్లేందుకు సౌకర్యం అందుబాటులోకి వస్తుంది.

గంజాయి రహిత జిల్లాయే లక్ష్యం

కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్ ఇతర అధికారులు

సాక్షి, పాడేరు: గంజాయి రహిత జిల్లా లక్ష్యంగా అందరూ పనిచేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. గంజాయి సాగు నిర్మూలనకు సంబంధించి కలెక్టరేట్‌లో పలుశాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి సాగు, వినియోగం వల్ల జరిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి సాగు విడిచిపెట్టిన గిరిజన రైతులకు స్వయం ఉపాధి, ప్రత్యామ్నాయ పంటల సాగు, బ్యాంకుల రుణాలు, పశువులు, మేకలు పంపిణీ చేయాలని సూచించారు. జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆదేశించారు.

గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు: డీఐజీ

జిల్లాలో గంజాయి సాగు నిర్మూలనకు పటిష్ట చర్యలు చేపట్టాలని డీఐజీ గోపినాథ్ జెట్టి ఆదేశించారు.అన్ని ప్రభుత్వ శాఖలు లక్ష్యాలను నిర్మించుకోవాలని ఆయన సూచించారు. గంజాయి సాగులో భాగస్వామ్యులైన వ్యక్తుల వివరాలను సేకరిస్తున్నామని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అమిత్‌బర్దర్, జేసీ అభిషేక్‌గౌడ్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్, పాడేరు ఏఎస్పీ ధీరజ్ పాల్గొన్నారు.

ఆస్పత్రికి తరలించేందుకు అష్టకష్టాలు

- గాయపడిన వృద్ధురాలిని డోలీలో తరలింపు
- అవస్థలు పడిన కుటుంబసభ్యులు, గ్రామస్తులు



డోలీలో పెద్దమ్మిని కొండలు దాటించి ఆస్పత్రికి తీసుకువెళుతున్న గొల్లపల్లి గ్రామ గిరిజనులు

గూడెంకొత్తవీధి: మారుమూల ప్రాంతాల గిరిజనులు అత్యవసర పరిస్థితుల్లో వైద్యసేవలు పొందేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ప్రాణాలమీదకు వస్తే డోలీని ఆశ్రయించాల్సిందే. మండలంలోని మారుమూల ఉన్న అమ్మవారి ధారకొండ పంచాయతీలోని గొల్లపల్లికి చెందిన వృద్ధురాలు చిలకల పెద్దమ్మి (54)ను ఆస్పత్రికి తరలించేందుకు అష్టకష్టాలు పడ్డారు. మంగళవారం పశువులను కాసేందుకు వెళ్లిన ఆమె ప్రమాదవశాత్తూ కొండపైనుంచి జారిపడింది. ఈ ఘటనలో ఆమె తొడ భాగంలో ఎముకలు విరిగిపోయాయి. వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించేందుకు కుటుంబ సభ్యులు, స్థానికులు ఆర్‌వీనగర్ పీహెచ్‌సీకి తరలించేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు బండరాళ్లు పడటంతో మార్గం మూసుకుపోయింది. దీంతో గ్రామానికి అంబులెన్సు వచ్చే అవకాశం లేదు. వెంటనే ఆమెను మరో మార్గంలో డోలీలో మోసుకుని జర్రెల ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకువెళ్లారు. రహదారికి మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తేవాలని గొల్లపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

చట్రాపల్లి బాధితులకు పరామర్శ

కేజీహెచ్‌లో క్షతగాత్రుల యోగక్షేమాలు తెలుసుకున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

మహారాణిపేట (విశాఖ): కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న జీకే వీధి మండలం చట్రాపల్లి వరద బాధితులను పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు మంగళవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి స్థానిక వైద్యులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఐదుగురు క్షతగాత్రులకు ఎమ్మెల్యే ఆర్థికసాయం చేశారు. అనంతరం ఆయన ఆస్పత్రి బయట విలేకరులతో మాట్లాడారు. జీకే వీధి మండలం చట్రాపల్లి, నిమ్మచెట్టు, మాదిమళ్ల తదితర గిరిజన గ్రామాలు ఇటీవల సంభవించిన వరదలకు పూర్తిగా అతలాకుతలం అయ్యాయని, గిరిజనులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

మైదాన ప్రాంతంలో ఏ చిన్నపాటి సంఘటన జరిగినా వేగంగా స్పందించే అధికారులు గిరిజన ప్రాంతాల్లో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. చట్రాపల్లి బాధితులు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నప్పటికీ నేటికీ అధికార పార్టీ ప్రజాప్రతినిధులెవరూ వెళ్లి పరామర్శించకపోవడం విచారకరమన్నారు. బాధితులకు నేటికీ పైసా పరిహారం కూడా అందకపోవడం ప్రభుత్వం పనితీరుకు అద్దం పడుతోందన్నారు. చట్రాపల్లి బాధితులకు వైఎస్సార్‌సీపీ తరఫున ఇప్పటికే నిత్యావసర సరకులు, దుస్తులు, తదితర సామగ్రి అందజేశామన్నారు. త్వరలోనే నిమ్మచెట్టు, మాదిమల్లు గ్రామాల గిరిజనులను కూడా పార్టీ తరఫున ఆదుకుంటామన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శి కూడా సురేష్ కుమార్, నాయకులు కూడా సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

బాధితులకు అండగా విరాళాల సేకరణ



చింతపల్లిలో విరాళాలు సేకరిస్తున్న మాజీ మంత్రి బాలరాజు

చింతపల్లి: చట్రాపల్లి వరద బాధితులను ఆదుకునేందుకు మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు మంగళవారం చింతపల్లిలో విరాళాల సేకరణ చేపట్టారు. జీకేవీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాపల్లి గ్రామంలో కొండచరియలు విరిగిపడి ఒకరు మృతి చెందగా మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. చాలా కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. బాధిత గిరిజనులను ఆదుకునేందుకు చింతపల్లిలో స్థానికంగా ఉంటున్న నాయకులతో కలిసి సాయిబాబా ఆలయం నుంచి మార్కెట్, ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలతోపాటు స్థానికుల నుంచి ఆయన విరాళాలు సేకరించారు. వీటిని చట్రాపల్లి నిరాశ్రయులకు అందజేస్తామని బాలరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్, వర్తకసంఘ ప్రతినిధులు భేతాళుడు, నాగేశ్వరరావు,రమేష్, బేతా రమణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయి కేసులో 20 సంవత్సరాల జైలు శిక్ష

అనకాపల్లి: జీపులో 16 మూటలతో 620 కేజీల గంజాయి రవాణా చేస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలానికి చెందిన కిల్లో కృష్ణారావు (32)కు అనకాపల్లిలోని అదనపు జిల్లా న్యాయమూర్తి నందనవనం శ్రీవిద్య 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చినట్లు పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ చెప్పారు. సీఐ అందించిన వివరాలు.. 2021 సెప్టెంబర్ 3వ తేదీన పట్టణ పోలీస్‌కు అందిన సమాచారం మేరకు అప్పటి ఎస్ఐ బి.సతీష్‌తో పాటు సిబ్బంది అనకాపల్లి జాతీయ రహదారిలో రోడ్డు పక్కన ఆగి ఉన్న అనుమానాస్పద మహేంద్ర జీపును తనిఖీ చేయగా అందులో 16 మూటలలో 620 కేజీల గంజాయి లభించింది. నిందితుడు కిల్లో కృష్ణరావు జీపును విడిచిపెట్టి వెళ్లిపోవడంతో గంజాయిని అప్పటి సీఐ ఎల్.భాస్కరరావు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. డ్రైవర్‌ను 2021 అక్టోబర్ 23న అరెస్టు చేశారు. కేసు విచారణలో వాదోపవాదాలు విన్న అనంతరం న్యాయమూర్తి కిల్లో కృష్ణారావుకు 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు సీఐ చెప్పారు. ముద్దాయిని విశాఖ సెంట్రల్ జైలు తరలించడం జరిగిందని సీఐ తెలిపారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

సింహాచలం: సింహగిరిపై గత ఐదు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు మంగళవారం ఉదయం ఘనంగా ముగిశాయి. స్వామి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ భోగమండపంలో వేంజేపచేసి పంచామృతాలు, గంగధార జలాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం

– రోడ్డు రవాణా సంస్థ జిల్లా అధికారి లీలాప్రసాద్

హుకుంపేట: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని ప్రజలకు భరోసా కల్పించాలని రోడ్డు రవాణా సంస్థ జిల్లా అధికారి లీలాప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా రోడ్డు రవాణా శాఖ కార్యాలయంలో పాడేరు ఆర్టీసీ డిపోకు చెందిన ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో మాత్రమే ప్రయాణం సురక్షితం అనే విధంగా నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎస్‌డీఐ వల్లీ, విశాఖ ఆర్ఎస్‌టీ రాజు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



పాడేరు కలెక్టరేట్‌లో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్,ఇతర అధికారులు



పాడేరులోని విశ్వకర్మ విగ్రహానికి పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణ కుటుంబాలు

సాక్షి,పాడేరు: భగవాన్ విశ్వకర్మ జయంతిని కలెక్టరేట్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిని ప్రతి ఏడాది కులవృత్తులవారు,ఇంజినీర్లు ఘనంగా నిర్వహించుకోవడం మంచి సంప్రదాయమన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ డాక్టర్ ఎం.జె.అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్,సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్,డీఆర్‌వో పద్మావతి,విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు లక్కోజు నాగభూషణం,వేమవరపు సత్తిబాబు,చుక్కా సత్యనారాయణ, తాతారావు, సూరిబాబు, లలితాకుమారి,కేజీయారాణి తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో...

పట్టణంలోని సుండ్రుపుట్టులోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన భగవాన్ విశ్వకర్మ విగ్రహానికి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ధర్మకర్త నవర గోవిందరావు,విశ్వ బ్రాహ్మణ సంఘం పాడేరుశాఖ అధ్యక్షుడు కొమ్మోజు వెంకటరమణతో పాటు పలువురు విశ్వకర్మ జయంతిని ఘనంగా జరిపారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు.సాయంత్రం విశ్వకర్మ ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో నవర కుమారి, మునసాల బుజ్జి,మొగలతుర్తి శ్రీను,శ్రీశైలపు నానాజీ,నవర శివ,ఇతర విశ్వబ్రాహ్మణ కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులతోనే బంగారు భవిష్యత్తు

ఎమ్మెల్యే మత్స్యలింగం



కళాశాల భవనాన్ని ప్రారంభించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయటౌన్: ఉన్నత చదువులతోనే బంగారు భవిష్యత్తు లభిస్తుందని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా నిర్మించిన భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఆశలతో, ఎంతో డబ్బు ఖర్చు చేసి మీ తల్లిదండ్రులు కళాశాలకు పంపించి చదివిస్తున్నారని, వారి కలలు సాకారం చేసేందుకు, కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కళాశాల ఆవరణలో అలంకరణ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్, జెడ్పీటీసీ శెట్టి రోషిణి, ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, ఎన్ఎస్ఎస్ పీవోలు వై. విజయలక్ష్మి, మొష్యా అనిత కుమారి, పసుపులేటి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

టూరిజం వర్కర్లకు పూర్తి జీతాలు చెల్లించాలి



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్యపడాల్

జి.మాడుగుల : మండలంలో కొత్తపల్లి జలపాతం ఐటీడీఏ టూరిజం కార్మికులకు సీజన్‌లో తప్ప మిగతా కాలంలో అర్ధజీతాలు(సగం జీతాలు) ఇవ్వడం సమజసంగా లేదని, ఏడాది కాలంలో సీజన్ జీతాలు అమలు చేయాలని సీఐటీయు అల్లూరి జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. మండలంలో కొత్తపల్లి జలపాతం వద్ద పనిచేస్తున్న ఆదివాసీ ఐటీడీఏ టూరిజం వర్కర్స్ సమావేశం మంగళవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈ జలపాతం వద్ద మేనేజర్, సూపర్‌వైజర్‌తో సహా 23మంది పనిచేస్తున్నారని మేనేజర్‌కు రూ.15వేలు ఇస్తూ, ఈ మధ్య కాలంలో మరో రూ.5వేలు పెంచి రూ.20వేలు చెల్లిస్తున్నారని, సూపర్‌వైజర్‌కు రూ.12వేలు, వర్కర్‌కు రూ.8వేలు చొప్పున మాత్రమే చెల్లిస్తున్నారని అన్నారు. మేనేజర్, సూపర్‌వైజర్‌తో సహా వర్కర్స్‌కు నవంబర్, డిసెంబర్, జనవరి 3 నెలలకు జీతాలు చెల్లించి మిగతా 9 నెలల జీతంలో సగం జీతం సొమ్మును మాత్రమే చెల్లిస్తున్నారని ఇది చాలా అన్యాయమని అన్నారు. జలపాత వర్కర్లకు అర్ధజీతం చెల్లించడమేమిటని ఆయన ప్రశ్నించారు. ఏడాదిలో జలపాతానికి సందర్శకుల నుంచి రూ.40 లక్షల పైగా ఆదాయం వస్తుందని ఆదాయానికి తగ్గట్టుగా కార్మికులకు జీతభత్యాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జలపాతం వద్ద పర్యాటకుల రద్దీని బట్టీ మరుగుదొడ్లు ఉండాలని, అయితే ఇక్కడ రెండు మాత్రమే ఉండడంతో ఇబ్బందులకు గురవుతున్నారని, ఇక్కడ గేట్లు కూడా సరిగా లేవని అన్నారు. కార్మికుల జీతాలు సీజన్, అన్ సీజన్ అనే తేడా లేకుండా పూర్తి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ, టూరిజం సూపర్‌వైజర్ వంతాల అభి, వర్కర్స్ రాజు, రాము, నాగేశ్వరరావు, ప్రశాంత్, శ్రీను, కృష్ణబాబు, సురేష్ పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపులో వాగ్వాదం



అధికారులతో వాగ్వాదం చేస్తున్న బాధిత దుకాణదారులు

డుంబ్రిగుడ: హైవే నిర్మాణానికి అడ్డుగా ఉన్న దుకాణాల తొలగింపును హైవే అథారిటీ అధికారులు మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా కొంతసేపు ఇక్కడ ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. జాతీయ రహదారి 516 నిర్మాణంలో భాగంగా డుంబ్రిగుడ నుంచి గుంటసీమకు వెళ్లే రోడ్డులో డివైడర్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా డివైడర్ నిర్మాణానికి అడ్డుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహంతో పాటు నాలుగు చెక్క దుకాణాలు, మరో రెండు శాశ్వత దుకాణాలను జేసీబీతో తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పరిహారం చెల్లించిన తరువాతే దుకాణాలు తొలగించాలని పలువురు అడ్డుపడ్డారు. ఈ సందర్భంగా వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో అధికారులు దుకాణాల తొలగింపును తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ రహదారి నుంచి తూటంగి మీదుగా పెద్దబయలు, ఒడిశా రాష్ట్రాన్ని కలిపే రోడ్డుకి ఇరువైపుల ఉన్న దుకాణాలను తొలగించనున్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



అడ్డతీగల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి బాబు

అడ్డతీగల/ గంగవరం: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని అడ్డతీగల జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి పి.బాబు అన్నారు. అడ్డతీగల,గంగవరంలలో గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల,గురుకుల పాఠశాలలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి, సమస్యలు తెలుసుకున్నారు. వసతి సౌకర్యాలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన, మెనూ అమలు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని మెజిస్ట్రేట్ హెచ్చరించారు.

గిరిజనుల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలి

పీవో కట్టా సింహాచలం



దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లు పంపిణీ చేస్తున్న అధికారులు

రంపచోడవరం: జిల్లాలో గిరిజనుల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. స్థానిక పీఎంఆర్‌సీలో మంగళవారం ఎలింకో స్వచ్ఛంద సంస్థ ద్వారా దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లు, ఇతర ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ ఏజెన్సీ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి,సర్పంచ్ మంగా బొజ్జయ్య, వైస్ఎంపీపీ పండా కుమారి, కొమ్మిశెట్టి బాలకృష్ణ, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, మాజీ సర్పంచ్ నిరంజనీదేవి, ఏడీ జె.మాధవి పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ



యువకుడికి పర్సును అందిస్తున్న కండక్టర్, ఎస్ఐ

మారేడుమిల్లి : ఆర్టీసీ బస్సులో పడిపోయిన పర్సును అప్పగించి కండక్టర్ సీహెచ్.వి.రమణ నిజాయితీ చాటుకున్నారు. గోకవరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గోకవరం నుంచి పాతకోటకు బయలుదేరింది. ఆ బస్సులో దబ్బవలస గ్రామానికి చెందిన నెల్లూరి ఆంజనేయరెడ్డి అనే యువకుడు గోకవరం నుంచి రంపచోడవరం వరకు ప్రయాణించాడు. ఆయన పర్సు బస్సులో పడిపోయింది. దీనిని గమనించని ఆ యువకుడు బస్సు దిగివెళ్లిపోయాడు. బస్సు మారేడుమిల్లి చేరిన తరువాత కండక్టర్ సీహెచ్.వి.రమణ బస్సు సీటు కింద ఉన్న పర్సును గమనించాడు. అందులో రూ.9,000 నగదు ఉండడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో గుర్తేడు ఎస్ఐ సాయి కుమార్‌కు అందజేశాడు. పర్సులో ఫోన్ నంబర్ బట్టి యువకుడికి సమాచారం ఇచ్చారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో కండక్టర్ సమక్షంలో గుర్తేడు ఎస్ఐ ఆ యువకుడికి పర్సు అందజేశారు. నిజాయితీగా పర్సును అందజేసిన కండక్టర్‌ను ఎస్ఐతో పాటు పలువురు అభినందించారు.

కళాశాల ప్రిన్సిపాల్‌పై కేసులు నమోదు చేయాలి



ఏరియా ఆస్పత్రిలో విద్యార్థినితో మాట్లాడుతున్న బాలు

రంపచోడవరం: స్థానిక ఏపీఆర్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులతో వందల గుంజీలు తీయించి వేధింపులకు గురిచేసిన కళాశాల ప్రిన్సిపాల్ ప్రసూన,పీడీ లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు ఇతర కేసులు నమోదు చేయాలని జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యుడు అక్కిస బాలు డిమాండ్ చేశారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న విద్యార్థులను మంగళవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌సీ (మెడికో లీగల్ కేసు) నమోదు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



అరకులోయ పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మత్స్యలింగం

కలెక్టర్ దినేష్‌కుమార్



డుంబ్రిగుడలో మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు



కొయ్యూరులో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో, ఈవోఆర్‌డీ, వైస్ ఎంపీపీ



చింతపల్లిలో విద్యార్థులతో నిర్వహించిన మానవహారం

సాక్షి,పాడేరు: పరిసరాల పరిశుభ్రత బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. స్వచ్ఛ తాహి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక పాతబస్టాండ్ అంబేడ్కర్ సెంటర్ వద్ద విద్యార్థులతో భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ముందుగా ఆయన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల ఒకటి నుంచి గాంధీ జయంతి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛ తాహి కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలోని మూడు ఐటీడీఏల పరిధిలో పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. జేసీ అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ ఈపవో అభిషేక్, సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్, డీపీవో కొండలరావు, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, డీఈవో బ్రహ్మజీరావు, డీఆర్‌డీఏ పీడీ మురళీ, సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి పాల్గొన్నారు.

అరకులోయటౌన్: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన అరకులోయలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు పలు శాఖల అధికారులు, విద్యార్థులతో భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేష్, ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, జెడ్పీటీసీ శెట్టి రోషిణి, ఎంఈవో త్రినాథరావు, హెచ్‌ఎం దయానిధి, వైస్ ఎంపీపీ రామన్న, వెలుగు ఏపీ కృష్ణారావు, ఈవోపీఆర్‌డీ వెంకటరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వై.రామవరం: స్వచ్ఛత హీ సేవ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం వై.రామవరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కె.బాపన్నదొర అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకట లక్ష్మి, ఎంపీటీసీ వీరమళ్ళ సుబ్బలక్ష్మి, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎంపీపీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం స్థానిక బస్టాండు ఆవరణలో మానవహారం నిర్వహించారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోను ఆయా పంచాయతీల కార్యదర్శులు సచివాలయాల సిబ్బంది ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీవో సాయిబాబా, పంచాయతీ కార్యదర్శులు మధుసూదనరాజు, లోవరాజు, ప్రభుత్వజూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరకృప, నాయకుడు కరణం కనకరాజు, పీడీఎస్‌యూ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఐ.వి.రమణ పాల్గొన్నారు.

కూనవరం: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని జెడ్పీటీసీ గుజ్జా విజయ అన్నారు. స్వచ్ఛత హీసేవ కార్యక్రమంలో భాగంగా మండలంలో పలు సచివాలయాల పరిధిలో మంగళవారం ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలని, దోమతెరలు వినియోగించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో కె.ఆర్.విజయ, ఎంఈవో లక్ష్మయ్య, వెలుగు ఏపీఎం భాస్కర్, ఈవోపీఆర్‌డీ రామాంజనేయ ప్రసాద్ తదితరలు పాల్గొన్నారు.

అడ్డతీగల: గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే ప్రజల సహకారం తప్పనిసరి అని ఎంపీడీవో ఎ.రంగారావు అన్నారు. అడ్డతీగలలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛభారత్ లక్ష్యాన్ని వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి సీతపల్లి జంక్షన్,దేవీసెంటర్ వరకూ వెళ్లి మానవహారం నిర్వహించారు. అనంతరం గాంధీ సెంటర్ మీదగా మార్కెట్ రోడ్,వాల్మీకి సెంటర్ వరకూ ర్యాలీ కొనసాగించారు.

కొయ్యూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో మేరీరోజ్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. వైస్ ఎంపీపీ అంబటి నూకాలు, ఈవోఆర్‌డీ ప్రసాద్, ఏపీవో-2 శ్రీనివాస్ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ : పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ బాకా ఈశ్వరి, జెడ్పీటీసీ చటరి జానకమ్మ అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీవో ఉషారాణి ఆధ్వర్యంలో విజయనగరం-భద్రాచలం జాతీయ రహదారి 516 వద్ద మానవహారం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రత లేకపోతే అనేక రకాల రోగాలు వ్యాప్తి చెందే అవకాశలు ఉన్నయని అన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సునీత, సర్పంచ్ వెంకటరావు, లైగండ ఎంపీటీసీ రామరావు, వైఎస్సార్‌సీపీ మండల మహిళ అధ్యక్షురాలు బంగురు శాంతి, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

హుకుంపేట: పరిసరాల పరిశుభ్రత,స్వచ్ఛత వల్ల మానవాళికి మంచి ఆరోగ్యం లభిస్తుందని ఈవోపీఆర్డీ అప్పలరాజు తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం హుకుంపేటలో అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ,ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మ రమ, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ రమేష్,మండల ప్రజాపరిషత్ సిబ్బంది అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేసి,మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సీతమ్మ,ఈవోపీఆర్‌డీవో చిన్నన్న, ఏపీఎం కళావతి,ఏపీవో సంఘంనాయుడు,పంచాయతీ కార్యదర్శులు గోపి, సింహాచలం, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

జి.మాడుగుల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీపీ వంతాల కళ్యాణి తెలిపారు. జి.మాడుగులలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ విజయకుమారి, ఈవోపీఆర్డీ డేవిడ్, ఏవో వీరభద్రరావు, ఎస్ఐ కుమార్‌బాబు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

చింతపల్లి: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్య పడాల్ అన్నారు. మంగళవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం , బస్ కాంప్లెక్స్, హనుమాన్ జంక్షన్ మీదుగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, మానవహారంజరిపారు. అనంతరం వారు మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ఆశాజ్యోతి, తహసీల్దార్ రామకృష్ణ ఎంఈవోలు ప్రసాద్, బోడంనాయుడు, సర్పంచ్ పుష్పలత, ప్రధానోపాధ్యాయులు రామరాజుపడాల్, కొండలరావు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : స్థానిక పంచాయతీ కార్యదర్శి వి.పరమేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ, మానవహారం జరిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండా జాకబ్ పాల్గొన్నారు.

గంగవరం: మండల కేంద్రమైన గంగవరంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ కలుముల అక్కమ్మ, ఈవోపీఆర్డీ నరసింగరావు, ఉపాధి ఏపీవో ప్రకాష్, ఎంఈవో మల్లేశ్వరరావు, కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. పిడతమామిడిలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ నేసం మరిడమ్మ, ఉపాధ్యాయులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: ఏజెన్సీలో ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండే విధంగా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహిస్తోందని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. మంగళవారం ఇక్కడ నిర్వహించిన ర్యాలీని పీవో, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, సర్పంచ్ మంగా బొజ్జియ్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, డీఎల్‌డీవో కోటేశ్వరరావు, ఎంపీడీవో హరికృష్ణ, డీఎల్‌పీవో చిన్నబ్బులు, ఏపీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చింతూరు: ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండేలా అందరూ కృషి చేయాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ అన్నారు. మంగళవారం చింతూరులో నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం ఐటీడీఏ నుంచి చింతూరు మెయిన్ రోడ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించాచారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సవలం అమల, సర్పంచ్ కారం కన్నారావు, ఎంపీడీవో రవిబాబు పాల్గొన్నారు.



రంపచోడవరంలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ ర్యాలీ



ముంచంగిపుట్టులో మానవహారంగా ఏర్పడిన అధికారులు, విద్యార్థులు



వై.రామవరంలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీపీ ఆనందరావు